క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఎస్‌ఐలు

ఆళ్లగడ్డ: మండల కేంద్రం చాగలమర్రిలో గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని నోబెల్ థియేటర్ సమీపంలో మేము సైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ వీరభద్రుడు, ఎస్‌ఐ రమణయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా మజ్జిగ, పానకంను స్థానికులకు అందజేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాసులు నిర్వాహకు లు రంజిత్‌కుమార్, లక్ష్మీనారాయణ గౌడ్, పీర య్య, నరసింహులు, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, రాజ్‌కుమార్, రాజేంద్ర, నరసింహ, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్‌ఆర్ ఆసరా సమావేశం

ఉయ్యాలవాడ: వైఎస్‌ఆర్ ఆసరా మూడో విడత పొదుపు మహిళలకు చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఏపీఎం శేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాలులో మూడు గంటలకు నిర్వహించనున్న సమావేశానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రానున్నట్లు వెల్లడించారు.

వాహనాల వేలానికి సిద్ధం చేయండి

రుద్రవరం: పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేసేందుకు సిద్ధం చేయాలని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి రుద్రవరం పోలీసులను ఆదేశించారు. గురువారం ఆయన రుద్రవరం పోలీస్ స్టేషన్లో రికార్డులను, వేలం వేయాల్సిన వాహనాలను పరిశీలించారు. అనంతరం శిరివెళ్ల సీఐ చంద్రబాబునాయుడు, ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డితో కలిసి మండల పరిధిలోని శ్రీరంగాపురానికి వెళ్లారు. అక్కడ ఇటీవల జరిగిన స్వల్ప ఘర్షణపై ఆరా తీశారు. బాధితులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డీఎస్పీని కోరారు.

నేడు ఇఫ్తార్ విందు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని వైఎస్సార్‌నగర్‌లో శుక్రవారం సాయంత్రం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం మత పెద్దలకు ఇఫ్తారు విందు ఇవ్వనున్నట్లు బుడగజంగాల సంఘం రాష్ట్ర నాయకుడు తాటికొండ బుగ్గరాముడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 200 మంది పేద ముస్లిం మహిళలకు చీరలు, 100 కుటుంబాలకు రంజాన్‌తోఫా ఇవ్వనున్నామన్నారు.

వలంటీర్ సేవకు ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఏప్రిల్ 4న ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమానికి వలంటీర్‌గా సేవలు అందించేందుకు ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని మన ఊరు–మన గుడి, మన బాధ్యత కార్యక్రమం నిర్వాహకులు శివప్రసాదరెడ్డి, రాంప్రసాద్ కోరారు.గురువారం వారు మాట్లాడుతూ ప్రవచన కార్యక్రమ నిర్వహణకు 1,000 మంది వలంటీర్లు కావాలన్నారు. ఆసక్తి ఉన్న వారు 8074643715, 9949377662లను సంప్రదించాలన్నారు.

ఆధునికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): వైద్య రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ డాక్టర్లకు సూచించారు. గురువారం స్థానిక హోటల్ సమావేశ భవనంలో చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై ఒక్కరోజు వైద్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వైద్యులు తమ వైద్య పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలన్నారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రాంతీయ వైద్య విజ్ఞాన సదస్సులు రాష్ట్రమంతా ఏర్పాటు చేస్తున్నామన్నారు. హఠాత్తుగా సంభవించే వినికిడి లోపాలు అంశంపై డాక్టర్ అనిల్‌కుమార్, వర్టిగో అంశంపై డాక్టర్ రామకృష్ణ వైద్యులకు వివరించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ జఫరుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడుకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం రానున్నట్లు యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.



బైటిపేట కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కోటావీధి రామాలయంలో వైభవంగా సీతారాముల కల్యాణం



కురువ పేటలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



చెర్రీ పళ్ల అలంకారంలో సీతారామలక్ష్మణులు



సంఘపేట రామాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కల్యాణ వైభోగమే !

- వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు
- రామ నామ స్మరణతో మారుమోగిన ఆలయాలు
- సీతారాముల కల్యాణాన్ని తిలకించి తరించిన భక్తజనం

శ్రీరామ నవమి వేడుకలు గురువారం నంద్యాల పట్టణంలోని వాడవాడలా జరిగాయి. రామ నామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సీతారాముల కల్యాణాన్ని వీక్షించి తరించారు. పానకం, వడ పప్పు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

– నంద్యాల(వ్యవసాయం)



సంజీవనగర్ రామాలయంలో మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

- సంజీవనగర్ రామాలయంలో సీతారాముల కల్యాణాన్ని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో వేదపండితులు పవన్‌శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, స్వర్ణ యజ్ఞోపవితధారణ, మహాసంకల్పం, మాంగళ్య ధారణ, ముత్యాల తలంబ్రాల తంతు నిర్వహించారు. అనంతరం సీతమ్మ వారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఊంజలసేవ నిర్వహించి సీతాలక్ష్మణ సమేత హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.
- దేవనగర్‌లోని పంచముఖి కాశీవిశ్వేశ్వర శివాలయంలో అర్చకులు శ్రీవాత్సవ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.
- నందమూరినగర్‌లోని కోదండ రామాలయంలో సీ తారాముల కల్యాణాన్ని రామాలయ అభివృద్ధిక మిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మ ధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి,అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు.
- కల్పనా సెంటర్‌లోని రామాలయంలో సీతారాముల కల్యాణం మాజీ కౌన్సిలర్ కత్తిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గోస్పాడు: నెహ్రూనగర్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



టెక్కె నాగలింగేశ్వర ఆలయంలో కల్యాణంలో పాల్గొన్న భక్తులు

- ఉప్పరిపేటలోని శ్రీరామభక్త భజన బృందం ఆధ్వర్యంలో పసుపులేటి నారాయణ, సురేష్, ఉప్పరి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు.
- బైటిపేట రామాంజనేయస్వామి దేవస్థానంలోని కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పానకం, వడపప్పు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ రామాంజనేయశర్మ పాల్గొన్నారు.
- కోటావీధిలోని సీతారామలింగేశ్వరస్వామి భవానీ సహిత దేవస్థానంలో సీతారాముల కల్యాణం కొత్త కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.
- ఎన్‌జీఓ కాలనీలోని సాయికరుణాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సంగపేట కోదండ రామాలయంలో రాములవారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని బాలాజీ కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణం అంత్యంత వైభవంగా నిర్వహించారు. టెక్కె అభయాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.
- గోస్పాడు మండల పరిధిలోని గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. నెహ్రూనగర్, పార్వతీపురం, జిల్లెల్ల, యాళ్లూరు తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణం ఆయా ఆలయాల వద్ద వేదపండితులు మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సీతారాముల కల్యాణం చూతమురారండీ

ఆళ్లగడ్డ: శ్రీరామనవమి వేడుకలను గురువారం నియోజకవర్గ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అన్ని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు చూపరులను కనువిందు చేశాయి. శాంతినగరం గ్రామంలో నిర్వహించిన నవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్సీ దంపతులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఇందిరమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బృందావనంలో రామాలయంలో నిర్వహించిన శ్రీరామ నవమిలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది జంటల దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు.

- **దొర్నిపాడు:** మండలంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఎల్లమ్మ ఆలయం వారు అన్నదానం చేశారు. అమ్మిరెడ్డి నగరంలో సీతారాముల గ్రామోత్సవం ముందు చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్ర మంలో సర్పంచు దంపతులు లక్కు మాధవి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



రుద్రవరంలో సీతారాములకు తలంబ్రాల వేస్తున్న పండితులు

- **ఉయ్యాలవాడ:** మండల వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. స్థానిక కోదండ రామాలయంలో, సర్వాయిపల్లె, హరివరం గ్రామాల్లోని సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. ఉయ్యాలవాడ గ్రామంలో స్వామి వారి కల్యాణానికి ఉప సర్పంచ్ భారతి, ఈశ్వరరెడ్డి దంపతులు, రమేష్, శ్రవంతి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, మంగళసూత్రం అందజేశారు. వేదపండితులు సీతారాముల వధూవరులను అలంకరించి నేత్రానందంగా వివాహం నిర్వహించారు.
- **రుద్రవరం:** శ్రీరామ నవమి పర్వదినాన్ని మండల ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో కొలువైన సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి వారికి అర్చకులు ఉదయాన్నే నిత్య పూజలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శణం కల్పించారు. సాయంత్రం విశేష పూజలతో పాటు పానకం పంపిణీ చేశారు.



బృందావనంలో నవమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- **శిరివెళ్ల:** మండలంలో శ్రీరామనవమి పండుగ ఘనంగా జరిగింది. శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, వీరారెడ్డిపల్లె, బోయలకుంట్ల, రాజనగరం, గాంధీనగరం, పార్వతీపురం, మహదేవపురం గ్రామాల శ్రీరామాలయాల్లో స్వామి వారి కల్యాణం భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించుకున్నారు.



దొర్నిపాడులో రాములోరి పెళ్లి నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మిరెడ్డి నగరంలో రాములోరి గ్రామోత్సవం ముందు చిన్నారుల కోలాటం



ఉయ్యాలవాడలో భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకులు



భక్తులకు పానకం పోస్తున్న దృశ్యం



శాంతినగరంలో నవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి దంపతులు

అహోబిలంలో..

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్ర పరిధిలో నెలవైన నవనారసింహ క్షేత్రాలు భక్త జనసంద్రంగా మారాయి. శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకుని గురువారం భక్తులు తండోపతండాలుగా వచ్చి భక్తి పారవశ్యంతో చేసిన గోవిందా నామస్మరణతో నల్లమల పులకించి పోయింది. ఈ సందర్భంగా దిగువ అహోబిలంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ప్రత్యేక పల్లకీలో కొలువుంచి అహోబిలం మఠంలో వెలసిన సీతారామ సన్నిధికి తోడ్కొని వచ్చారు. సీతారామచంద్రుడు, లక్ష్మణ స్వాములకు, శ్రీదేవి, భూదేవి, సమేత ప్రహ్లాదవరద స్వాములకు అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి భక్తులకు దర్శణ భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులకు మాడ వీధుల్లో వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించి కార్యక్రమాన్ని ముగించారు.



ఉత్సవ మూర్తులు సీతారామచంద్రులు, లక్ష్మణ స్వాములు

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

కొత్తపల్లి: మండలంలోని ఎం.లింగాపురం గ్రామంలో అప్పులబాధ భరించలేక ఓ రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు లింగాపురం గ్రామానికి చెందిన చిమ్మే నడిపి వెంకటేశ్వర్లు (37) తనకున్న ఎకరంన్నర పొలంతో పాటు మరో ఏడున్నర ఎకరాలను కౌలుకు తీసుకున్నాడు. ఇందులో గత రెండేళ్ల నుంచి మినుము, పత్తి పంటలను సాగుచేసుకుంటున్నాడు. పంటల సాగు కోసం రూ.8లక్షల దాకా అప్పులు చేశాడు. పంటలు చేతిరాక నష్టం రావడంతో అప్పులోళ్ల బాధ తాళలేక ఇంట్లోనే పురుగుల మందు సేవి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

దారి దోపిడీ

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరు మెట్ట వద్ద గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగుడు దారి దోపిడీకి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలు.. శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలోని ఆలయంలో స్వామి అమ్మవార్లకు కల్యాణం నిర్వహించేందుకు గ్రామ పెద్దలు సిద్ధం చేశారు. అందులోభాగంగా అర్చకుడిని తీసుకు వచ్చేందుకు తెల్లవారుజామున పెద్ద మాబు అనే వ్యక్తిని మోటార్ సైకిల్‌పై శిరివెళ్లకు పంపారు. మార్గమధ్యలో మెట్ట వద్ద మాస్క్ ధరించిన గుర్తుతెలియని దుండగుడు పల్సర్ బైక్‌పై వచ్చి పెద్ద మాబు వాహనాన్ని నిలిపేశాడు. కత్తితో బెదిరించి మెడలో ఉన్న వెండి గొలుసు, రూ.1,500 నగదు లాక్కొని ఉడాయించాడు. ఇదే విషయమై ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని, కేసు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు.

శ్రీశైలంలో సెల్‌ఫోన్లు బంద్

శ్రీశైలం: శ్రీశైలం మండలంలో బుధవారం నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లు పనిచేయకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దోర్నాల నుంచి సున్నిపెంట వరకు ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ భూఅంతర్భాగ నెట్‌కేబుల్ తెగిపోవడంతో నెట్వర్క్ ప్రాబ్లమ్ ఏర్పడినట్లు బీఎస్‌ఎన్‌ఎల్ వర్గాల ద్వారా తెలిసింది. ఎట్టకేలను సేవలను పునరుద్ధరించడంతో గురువారం 11 గంటల నంచి బీఎస్‌ఎన్‌ఎల్‌తో పాటు ఇతరనెట్‌వర్క్‌లు పనిచేశాయి.

ఎమ్మెల్యేకు హమాలీల కృతజ్ఞతలు

నంద్యాల(అర్బన్): ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డికి గురువారం స్థానిక సీడబ్ల్యూసీ గోడౌన్ హమాలీలు కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే వ్యాగన్ల ద్వారా ధాన్యం సీడబ్ల్యూసీ గోడౌన్‌కు చేరుతుండటంతో వందలాది మంది హమాలీలకు ఉపాధి దొరికేది. ఇటీవల సీడబ్ల్యూసీ గోడౌన్‌కు ధాన్యం చేరకుండా ప్రైవేటు గోడౌన్లలో నిల్వ ఉంచి అక్కడి నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్లకు తరలిస్తుండటంతో సీడబ్ల్యూసీ గోడౌన్ హమాలీలు ఉపాధి కోల్పోయారు. ఇదే విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. దీంతో ఎమ్మెల్యేను శాలువా, గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న హమాలీలు

బాల్ బ్యాడ్మింటన్ విజేత సదరన్ రైల్వే



ప్రత్యర్థితో తలపడుతున్న సదరన్ రైల్వే జట్టు

గోస్పాడు: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మండలంలోని నాగులవరం గ్రామంలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమిళనాడుకు చెందిన సదరన్ రైల్వే జట్టు మొదటి స్థానంలో నిలిచింది. అఖిల భారత బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు కొనసాగి గురువారంతో ముగిశాయి. గ్రామస్తుల సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో 17 జట్లు పాల్గొన్నాయి. లీగ్ కం సూపర్ లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. తమిళనాడుకు చెందిన జట్లే మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. అందులో సదరన్ రైల్వే జట్టుమొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, మూడో స్థానంలో పోస్టల్ శాఖ జట్టు, నాలుగవ స్థానంలో ఐసీఎఫ్ జట్టు నిలువగా ఐదవ స్థానంలో ఏసు నాగులవరం జట్టు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



హాజరైన సచివాలయ, మండల కన్వీనర్లు, ఇన్‌చార్జులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

- టీడీపీ తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టండి
- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల: పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని తేజశ్వరి హోటల్‌లో నియోజకవర్గ సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు, సచివాలయ ఇన్‌చార్జులు, కౌన్సిలర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి సచివాలయ కన్వీనర్లు, మండల కన్వీనర్లు, సచివాలయ ఇన్‌చార్జులే రథ సారథులన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తూ పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీపీ మధుసూదన్‌రెడ్డి, శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమాన్, విజయశేఖర్‌రెడ్డి, సిద్ధంశివరాం, రామసుబ్బారెడ్డి, బసవేశ్వరరెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.